సహృదయాలకు సత్కారం



మెర్ల మురళీధర్‌ను సత్కరిస్తున్న డీఎంఈ, సూపరింటెండెంట్‌లు



కంటిపూడి సర్వారాయుడిని సత్కరిస్తున్న డీఎంఈ, సూపరింటెండెంట్‌లు

- జీజీహెచ్ అభివృద్ధికి చేయూతనిచ్చిన దాతలకు సన్మానం
- జీజీహెచ్ ఎస్‌పీఎం గ్యాలరీలో ఘనంగా వేడుక

కాకినాడ క్రైం: ఎంతో మంది రోగులకు అండగా ఉన్న కాకినాడ జీజీహెచ్ అభివృద్ధికి తోడ్పాటునందించిన దాతలను ఘనంగా సత్కరించారు. దీనికి ధర్మాసుపత్రి వేదికైంది.

ఆర్ఎంసీ వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ ఎ.విష్ణువర్ధన్ అధ్యక్షతన డాక్టర్ దేవీ మాధవి పర్యవేక్షణలో జరిగిన దాతల సత్కార కార్యక్రమానికి రాష్ట్ర వైద్య విద్యా సంచాలకుడు(డీఎంఈ) డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయనతో పాటు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి దాతలను స్వయంగా సత్కరించారు.

దాతలు ఓహెచ్‌వోడీ

ఇద్దరి పెద్ద మనసు, హెచ్‌వోడీ చొరవ జీజీహెచ్ మత్తు విభాగం రూపురేఖల్ని మార్చేశాయి. రోగులకు ప్రాణప్రదాయినిగా మారాయి. వారే కర్నాటి వెంకటేశ్వరరావు(కేవీ రావు), మెర్ల మురళీధర్‌లు. వీరు కేఎస్‌పీఎల్‌కు చైర్మన్ అండ్ ఎండీగాను, సీవోవోగాను వ్యవహరిస్తున్నారు. సామాజిక బాధ్యతలో భాగంగా దశల వారీగా రూ.3.76 కోట్ల వ్యయంతో ఐదు అనస్థీషియా వర్క్ స్టేషన్లు, మూడు మల్టీ పారా మానిటర్లు, ఒక ఇంక్యుబేటింగ్ బ్రాంకోస్కోప్, ఒక జీఈ అల్ట్రా సౌండ్ యంత్రం, హెచ్ఎఫ్ఎన్‌వో యంత్రాలు, 20 వెంటిలేటర్లు, అధునాతన అంబులెన్సు దానం చేశారు. ఈ దాతలిద్దరి తరఫున మెర్ల మురళీధర్‌ను డాక్టర్ నరసింహం, డాక్టర్ లావణ్యకుమారి ఘనంగా సంత్కరించారు.


మంచినీటి వసతి కోసం రూ.10 లక్షలు

కంటిపూడి సర్వారాయుడు, పలు సామాజిక ఉద్యమాల్లో భాగస్వామ్యం అయ్యారు. కొంతమూరు, కాటేరు, మునికూడలి, లొల్ల, రాయ్‌చూర్‌లలో ప్రజల కోసం మంచి నీటి వసతి కల్పించిన ఘనాపాటి. సర్వారాయుడు అదే సేవాగుణాన్ని ఆర్ఎంసీ వైద్య విద్యార్థుల కోసం విస్తరించారు. 1000 లీటర్ల సామర్థ్యం ఉన్న ఆర్‌వో ప్లాంటును అప్‌గ్రేడ్ చేసి అందుబాటులోకి తెచ్చారు. అలాగే, ఆర్ఎంసీ 2001 థండర్ బ్యాచ్ ఫోరెన్సిక్ మెడిసిన్ డిపార్టుమెంట్‌కు ఆర్‌వో ప్లాంటు సమకూర్చడంలో డాక్టర్ పీఎల్ఆర్ఎస్ఎస్ రావు ఎంతో కృషి చేశారు. 2003 బ్రిగేడ్స్ బ్యాచ్ అనాటమీకి రూ.లక్షలాది విలువ చేసే ఆర్‌వో ప్లాంట్ సమకూర్చడంలో అనస్థీషియా నిపుణుడు డాక్టర్ ఎస్‌వి.లక్ష్మీనారాయణ కీలకంగా వ్యవహరించారు. ఈ నేపథ్యంలో సర్వారాయుడు, డాక్టర్ రావు, డాక్టర్ లక్ష్మీనారాయణలను డీఎంఈ, సూపరింటెండెంట్‌లు ఘనంగా సత్కరించారు.

డిజిటల్ బ్లాక్ బోర్డులతో బోధనకు చేయూత

డిజిటల్ బ్లాక్ బోర్డులు సమకూర్చిన 1972 బ్యాచ్ పూర్వపు విద్యార్థుల బృందం సత్కారం పొందింది. బ్యాచ్ తరఫున ప్రముఖ భాను నర్సింగ్ హోం గైనికాలజిస్టు డాక్టర్ జి.రవికుమార్, శ్రీశ న్యూరో క్లినిక్ సీనియర్ న్యూరాలజిస్టు డాక్టర్ డి.శేషగిరి రావు, డాక్టర్ ఎస్.వరహాలబాబు, డాక్టర్ రఘు పబ్బినీడిలకు ఆహ్వానం అందింది. బ్యాచ్ తరఫున డాక్టర్ రవికుమార్, డాక్టర్ వరహాలబాబు సత్కారం అందుకున్నారు. అలాగే, సైకియాట్రీ నిపుణుడు డాక్టర్ వానపల్లి వరప్రసాద్ కొద్ది రోజుల క్రితం తమ బ్యాచ్ తరఫున ఫోరెన్సిక్ మెడిసిన్ విభాగానికి డిజిటల్ బ్లాక్‌బోర్డు సమకూర్చారు. ఈ విషయాన్ని డీఎంఈ డాక్టర్ నరసింహం ప్రస్తావిస్తూ డాక్టర్ వరప్రసాద్‌తో పాటు పూర్వపు విద్యార్థుల కృషిని కొనియాడారు. ఇరు బ్యాచ్‌లు సమకూర్చిన ఖరీదైన డిజిటల్ బ్లాక్ బోర్డుల ఖరీదు రూ.10 లక్షలు కాగా విద్యార్థుల బోధనకు ఇవి ఎంతగానో ఉపకరిస్తున్నాయి.

రోగులకు సాయంగా..



పేదలకు మెరుగైన వైద్యం అందించాలన్నదే దాతల తపన. ఆర్ఎంసీ వైస్ ప్రిన్సిపాల్, అనస్థీషియా హెచ్‌వోడీ డాక్టర్ విష్ణువర్ధన్, పూర్వపు సూపరింటెండెంట్ డాక్టర్ హేమలతాదేవి దాతలను ప్రోత్సహించిన విధానం మరువలేనిది. వారిని చూసి పలువురు దాతలు ముందుకు రావడం అసామాన్య విషయం. వారికి అభినందనలు.

– డాక్టర్ నరసింహం, డీఎంఈ, ఆంధ్రప్రదేశ్

క్లుప్తంగా

ఖైదీల ఆహార పదార్థాల నాణ్యత పరిశీలన

కాకినాడ లీగల్: స్థానిక సబ్ జైలులో ఖైదీలకు పెట్టే ఆహార పదార్థాల నాణ్యతను కాకినాడ మూడో అదనపు జ్యూడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ డి.శ్రీదేవి పరిశీలించారు. సబ్ జైలు తనిఖీల్లో భాగంగా శనివారం జైలులో ఖైదీలకు పెట్టే ఆహారాన్ని ఆమె పరిశీలించారు. ఖైదీలకు నాణ్యమైన ఆహారం పెట్టాలని సూచించారు. అనంతరం స్టోర్‌రూం, సబ్ జైలు పరిసర ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఖైదీలు సత్ప్రవర్తన కలిగి ఉండాలని మెజిస్ట్రేట్ శ్రీదేవి అన్నారు. కార్యక్రమంలో సబ్‌జైలు సూపరింటెండెంట్ ఎం.వీరబాబు, డిప్యూటీ జైలర్ జోసఫ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే స్థానిక రామారావుపేటలో ఉన్న నైట్ సెల్టర్‌ను ఆమె పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేశారు.

బాలికల భద్రతపై అవగాహన

బాలాజీచెరువు: ఏబీసీ ఆధ్వర్యంలో శనివారం నుంచి మూడు రోజుల పాటు నగరంలో ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాల విద్యార్థినులకు బాలికల భద్రతపై ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. సేఫ్టీ ఎన్‌జీవో హైదరాబాద్ సహకారంతో ఏబీసీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు రిక్కీ గూటం ఆధ్వర్యంలో 7200 మంది విద్యార్థినులకు బాలికలు తమను తాము ఏలా రక్షించుకోవాలో అనే తదితర విషయాలపై అర్థమయ్యేలా వివరించారు. తొలిరోజు భాగంగా శనివారం రామకృష్ణ,నారాయణ, నోవా భారత్, కేటీసీ, ఆదిత్య తదితర పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు.

కుమారస్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో కుమారస్వామి

బోట్‌క్లబ్: కల్యాణోత్సవాల్లో భాగంగా స్థానిక దేవాలయంవీధిలోని వల్లీదేవసేన సమేత కుమారస్వామి వారికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామి వారికి పంచామృతాభిషేకం చేశారు. అమ్మవారి కుంకుమ పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ ఈఓ రాపర్తి రాజేశ్వరరావు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

బోడ రవికుమార్ మృతి



కాకినాడ సిటీ: వైఎస్సార్ సీపీ కాకినాడ నగర వాణిజ్య విభాగం అధ్యక్షుడు బోడా రవికుమార్ శనివారం మృతి చెందారు. కొద్ది రోజులుగా అస్వస్థతతో ఉన్న ఆయన కాకినాడ ట్రస్ట్ హాస్పిటల్‌లో మృతి చెందారు. రవి మృతిపై కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కౌడా చైర్‌పర్సన రాగిరెడ్డి చంద్రకళ దీప్తి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షులు సుంకర శివప్రసన్న, ఏఎంసీ చైర్‌పర్సన్ పసుపులేటి వెంకటలక్ష్మి, బాలాత్రిపుర సుందరి, ఆలయ కమిటీ చైర్మన్ పెద్ది రత్నాజీ తదితరులు సంతాపం తెలిపారు.

కూటమి ఎన్నికల ప్రచారం

కరప: కొరిపల్లి గ్రామంలో శనివారం కాకినాడ రూరల్ నియోజకవర్గ కూటమి అభ్యర్థి పంతం నానాజీ జేఎస్పీ, టీడీపీ, బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఎన్నికల ప్రచారం చేశారు. మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, టీడీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ పిల్లి సత్యనారాయణ మూర్తి, ఆయా పార్టీల నాయకులు పాల్గొన్నారు.

బ్లాక్ కరెన్సీ కేసులో ప్రధాన నిందితుడి అరెస్ట్

గోపాలపట్నం: బ్లాక్ కరెన్సీ కేసులో ప్రధాన నిందితుడు షేక్ అబ్దుల్ గని అలియాస్(గనిరాజు)ను ఎయిర్‌పోర్టు పోలీసులు అరెస్ట్ చేసి, శనివారం రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాలివీ.. గత నెల 20న కాకానినగర్‌లోని ఓ ట్రావెల్స్ కార్యాలయంలో ఇద్దరు వ్యక్తుల వద్ద ఉన్న బ్లాక్ కరెన్సీ ఉన్నట్లు విశ్వసనీయ సమాచారంతో పోలీసులు దాడి చేశారు. విశాఖకు చెందిన కోసుంపూరి వెంకట కన కదుర్గరాజు అలియాస్ భాస్కరరావు, పశ్చిమ గోదావరి జిల్లా యండగండికి చెందిన మద్దాల శ్రీనివాసరావులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.3కోట్ల విలువైన మూడు బ్యాగుల్లో బ్లాక్ కరెన్సీని స్వాధీనం చేసుకున్నారు. వారిని విచారించగా.. దీనికి సూత్రధారి గనిరాజు అని వారు వెల్లడించారు. ప్రత్యేక బృందాలుగా ఏర్పడి అప్పటి నుంచి అతని కోసం గాలిస్తున్నారు. కాగా.. శుక్రవారం కాకానినగర్ వద్ద పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తున్నారు. ఈ క్రమంలో కారులో ఉన్న గనిరాజును గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిని విచారించగా నల్లటి రంగు పూసిన కాగితాలను రసాయనంలో ముంచితే అసలు కరెన్సీగా మారుతుందని నమ్మించి మోసానికి పాల్పడుతున్నట్లు తెలిపాడు. అతనిది కాకినాడ దగ్గరలోని పెనుమర్తి ప్రాంతం. పదేళ్ల కిందట నిందితుడిపై దొంగ నోట్ల మార్పిడి కేసు నమోదైంది. అతని నుంచి కారు, 10 మొబైల్ ఫోన్లు, బంగారు చైన్, వాచ్ స్వాధీనం చేసుకున్నారు. శనివారం గనిరాజును రిమాండ్‌కు తరలించారు.

అరుణాచలం యాత్రకు బయలుదేరిన ఆర్టీసీ బస్సు



ఆర్టీసీ బస్సును ప్రారంభిస్తున్న డిపో మేనేజర్ మనోహర్

కాకినాడ సిటీ: ఆంధ్రప్రదేశ్ రోడ్డు రవాణా సంస్థ కాకినాడ డిపో నుంచి అరుణాచలం యాత్రకు శనివారం సూపర్ లగ్జరీ స్పెషల్ బస్సును డిపో మేనేజర్ ఎంయువీ మనోహర్ ప్రారంభించారు. శనివారం ఉదయం 11 గంటలకు అరుణాచలం యాత్రకు బయలుదేరిన ఈ బస్సు మూడు రోజుల యాత్రలో ఐదు క్షేత్రాలు చూపించి తిరిగి ఈనెల 26వ తేదీన కాకినాడకు చేరుతుందన్నారు. ఈ యాత్రలో కాణిపాకం, శ్రీపురం, అరుణాచలం, కంచి చూపిస్తారని మేనేజర్ మనోహర్ తెలిపారు.

ముగిసిన 'పోషణ్ పక్వాడా'

కాకినాడ క్రైం: సమగ్ర శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 9వ తేదీ నుంచి జరుగుతున్న పోషణ్ అభియాన్ పరిధిలోని పోషణ్ పక్వాడ కార్యక్రమం శనివారంతో ముగిసింది. ఈ మేరకు జగన్నాథపురం-1 సెక్టార్ పరిధిలో 29 అంగన్వాడీ కేంద్రాల సమక్షంలో సూపర్‌వైజర్ బి.ప్రభావతి ఆధ్వర్యంలో గోళీలపేటలో ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సెక్టార్ పరిధిలో ఉన్న 29 మంది అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, పలువురు బాలింతలు, గర్భిణులు హాజరయ్యారు.

48 గంటల లోపు అనుమతి తప్పనిసరి

- రిటర్నింగ్ అధికారి వెంకటరావు
- రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్వో వెంకటరావు, చిత్రంలో డీఎస్పీ హనుమంతరావు

కాకినాడ: ఎన్నికల ప్రచారానికి సంబంధించిన సభలు, సమావేశాలు, ర్యాలీలకు 48 గంటలలోపు అనుమతులు తీసుకోవాలని కాకినాడ సిటీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి జె.వెంకటరావు స్పష్టం చేశారు. స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో శనివారం సాయంత్రం డీఎస్పీ హనుమంతరావుతో కలిసి రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎన్నికల ప్రచారంలో అవలంబించాల్సిన విధి, విధానాలపై ఆర్వో సూచనలు ఇచ్చి నిబంధనలను తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకే మార్గంలో ఒకే రోజు రెండు పార్టీలకు సంబంధించిన సభలు, సమావేశాలకు దరఖాస్తు చేసుకోకూడదని స్పష్టం చేశారు. అనుమతులకు దరఖాస్తు చేసుకునేముందుకు రూటు కచ్చితంగా తెలియజేయాలని స్పష్టం చేశారు. ర్యాలీలల సందర్భంగా కర్రలు వినియోగంపై ఆంక్షలను వివరిస్తూ జెండాలు లేకుండా కర్రలను వినియోగించరాదని స్పష్టం చేశారు. సైలెన్సర్లు లేకుండా, నంబర్ బోర్డులు లేకుండా వాహనాలను వినియోగించకూడదన్నారు. ఎన్నికల కమిషన్, జిల్లా ఎన్నికల అధికారి ఇచ్చిన ఎన్నికల నిబంధనలను విధిగా పాటించాలని స్పష్టం చేశారు. సమావేశంలో సుంకర విద్యాసాగర్, ముమ్మిడిపవన్, రావూరి వెంకటేశ్వరరావు(వైఎస్ఆర్‌సీపీ), గదుల సాయిబాబా, తుమ్మల రమేష్(టీడీపీ), పలివెల వీరబాబు (సీపీఎం), అప్పారావు (బీఎస్పీ), నగరపాలక సంస్థ కార్యదర్శి ఎం.ఏసుబాబు, స్మార్ట్‌సిటీ ఎస్ఈ పి.వెంకటరావు, డిప్యూటీ కమిషనర్ గుంటూరు శేఖర్, ఎలక్షన్ డీటీ సీతాపతిరావు, డీసీపీ హరిదాసు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ అమలుకు ఐదు బృందాలతో నిఘా

కరప: మండలంలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు, ఎన్నికల కోడ్ అమలుకు ఐదు బృందాలు నియమించినట్టు ఎంపీడీఓ కె.అప్పారావు తెలిపారు. కరపలో శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. కోడ్ ఆఫ్ కాండక్ట్(ఎంసీసీ), ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్(ఎఫ్ఎస్‌టీ), స్టాటిక్ సర్వేలెన్స్ టీమ్(ఎస్ఎస్‌టీ), వీడియో వ్యూయింగ్ టీమ్(వీవీటీ), వీడియో సర్వెలన్స్‌టీమ్(వీఎస్‌టీ) బృందాలు పని చేస్తాయన్నారు. ఈ టీంలు నిత్యం గ్రామాల్లో పర్యటిస్తూ రాజకీయపార్టీలు నిర్వహించే సమావేశాలు, ఎన్నికల ప్రచారాలను, ఎన్నికల ఖర్చుపైన తనిఖీలు చేస్తూ ఉంటారన్నారు. ఈ బృందాలతో ఫోటోగ్రాఫర్, వీడియో గ్రాఫర్ కూడా ఉంటారన్నారు. ఎంసీసీ అధికారిగా ఎంపీడీఓ కె.అప్పారావు(9652693742), సభ్యుడిగా ఏఎస్ఐ వి.సూరిబాబు(9666132284), ఫ్లైయింగ్ స్కాడ్ అధికారిగా ఎంఈఓ పి.సత్యనారాయణ(9848751575), సభ్యులుగా పీసీ కె.లోవరాజు(6281102993), పీసీ పి.సత్యనారాయణ(9908991854), పీసీ కె.సురేష్(9493534252) పని చేస్తారన్నారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్ ఎండీ అహ్మద్ షఫిన్(9014329400), ఎస్ఎస్‌టీ అధికారిగా మండల ఇంజినీరింగ్ అధికారి జి.శైలజ(8886865417), సభ్యులుగా హెచ్‌సీ ఎం.వాడపల్లి(9989105815), పీసీ వి.వేణుగోపాల్(9490647357), పీసీ వాసిరెడ్డి వరహాలు(9705976997), వీవీటీ అధికారిగా హౌసింగ్ ఏఈఈ టీవీ నాగభూషణం(7093930451), సభ్యులుగా గ్రేడ్-5 సెక్రటరీ జి.స్వాతి(9154472234) పని చేస్తారన్నారు. డిజిటల్ అసిస్టెంట్ వి.సుప్రియ(6303207960), వీఎస్‌టీ టీమ్- అధికారిగా హౌసింగ్ ఏఈఈ ఎస్.రాంబాబు(7093930452), పి.సత్యనారాయణ మూర్తి(903198748) టీమ్-2 అధికారిగా ఇరిగేషన్ ఏఈఈ ఎమ్‌డీ శివకృష్ణ(9494181633), ఎమ్.రాజు(9951312253) ఈ బృందాలతో పనిచేస్తూ ఎన్నికల కోడ్ అమలును పర్యవేక్షిస్తూ ఉంటారని ఎంపీడీఓ అప్పారావు తెలిపారు. ఈ బృందాలకు అపరిమితమైన అధికారాలు ఉంటాయని, స్పాట్‌లో ఒక న్యాయాధికారిగా నిర్ణయం తీసుకునే అధికారం వీళ్లకు ఉందన్నారు. ఈ బృందాలు ఏరోజుకారోజు జరిగిన సంఘటనలపై జిల్లా కలెక్టర్‌కు, నియోజకవర్గ ఆర్వోకు తెలియజేస్తారన్నారు.

పారదర్శకంగా పనిచేస్తున్నాం.. కించపరచొద్దు..

- గైగోలుపాడు లూథరన్ చర్చి ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు



మీడియాతో మాట్లాడుతున్న ఎగ్జిక్యూటివ్ కమిటీ ప్రెసిడెంట్ శామ్యూల్.చిత్రంలో సభ్యులు

కాకినాడ రూరల్: గైగోలుపాడులోని లూథరన్ చర్చి ఆస్తులు కాపాడేందుకు తాము పారదర్శకంగా పనిచేస్తే సంఘ సభ్యులు విశ్వాసం పొందామని తమను కించపరిచేలా కావాలని కొందరు మీడియాకు స్టేట్‌మెంట్లు ఇస్తున్నారని ఎగ్జిక్యూటివ్ కమిటీ ప్రెసిడెంట్ కొంగు శామ్యూల్, జనరల్ సెక్రటరీ బి.డేవిడ్, కోశాధికారి పీవీఎస్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. గైగోలుపాడు లూథరన్ చర్చ్ ప్రాంగణంలో శనివారం మీడియా సమావేశంలో శామ్యూల్, డేవిడ్, అసోసియేషన్ ప్రెసిడెంట్ దాసరి సాల్మన్‌రాజు, వైఎస్ ప్రెసిడెంట్ చింద్రిపు వినయ్, సంయుక్త కార్యదర్శి దాసరి డేవిజ్ జయకుమార్ జేవీఎస్ రమణ తదితరులు మాట్లాడుతూ సంఘ సభ్యులు సహకారంతో లూథరన్ చర్చ్‌లో ఇటీవల పలు అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. కొందరి సభ్యులు మాటలు విని, తమను అభాసు పాలు చేయాలని కొందరు చూస్తున్నారన్నారు. లూథరన్ చర్చ్‌కి సంబంధించి అన్ని కోర్టు పరిధిలో ఉన్నాయన్నారు. తమను అనవసరమైన విషయాల్లోకి లాగి అభాసు పాలు చేయవద్దని పేర్కొన్నారు.

విప్లవ వీరులకు జోహార్లు



భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లకు నివాళులర్పిస్తున్న సీఐటీయూ నాయకులు

కాకినాడ సిటీ: స్థానిక కచేరిపేటలోని సీఐటీయూ కార్యాలయంలో విప్లవ వీరులైన భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల వర్ధంతి సందర్భంగా పలువురు నాయకులు శనివారం నివాళులర్పించారు. జిల్లా నాయకులు దువ్వా శేషబాబ్జీ, కె సత్తిరాజు విప్లవ వీరుల సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు చెక్కల రాజ్‌కుమార్, మలకా రమణ, రమణమ్మ, నర్ల ఈశ్వరి, కామేశ్వరి, నాగలక్ష్మి, వేణు, జ్యోతి, రత్నకుమారి, రాణి తదితరులు పాల్గొని భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు.

వైఎస్సార్ సీపీలో పలువురి చేరిక



పార్టీలో చేరిన పి.వెంకటాపురం వారితో ఎమ్మెల్యే కురసాల కన్నబాబు

కాకినాడ రూరల్: పి.వెంకటాపురం గ్రామానికి చెందిన పలువురు ఎమ్మెల్యే కురసాల కన్నబాబు సమక్షంలో వైఎస్సార్ సీపీలోకి శనివారం చేరారు. పి.వెంకటాపురం వైఎస్సార్ సీపీ నాయకురాలు నురుకుర్తి భవాని ఆధ్వర్యంలో టీడీపీ, జనసేనకు చెందిన వల్లు నాగభూషణం, మంగ, కొమ్ము సత్యవతి, కాకరపల్లి సునీత, మోతి కొండమ్మ, భద్రాసి లక్ష్మి, మాకిరెడ్డి గనిలక్ష్మి, పాటి విజయలక్ష్మి, అనసూరి అనంతలక్ష్మి, బొంతు శ్రీనివాసరావు, నురుకుర్తి ఉమాదేవి తదితరులు 40 మందికి కన్నబాబు పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారిని వైఎస్సార్ సీపీలోకి ఆహ్వానించి రానున్న ఎన్నికల్లో విజయం కోసం పనిచేయాలని కోరారు.

వాకలపూడి గ్రామంలో..

మండలంలోని వాకలపూడి గ్రామానికి చెందిన టీడీపీ, జనసేన కార్యకర్తలు ఆ గ్రామ వైఎస్సార్ సీపీ నాయకుడు నల్ల శ్రీను ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కన్నబాబు సమక్షంలో వైఎస్సార్ సీపీలోకి చేరారు. పార్టీలోకి చేరిన బాలిరెడ్డి సత్తిబాబు, బాలకృష్ణ, చోడిశెట్టి కృష్ణకుమార్, కొరిమిల్లి సుబ్బారావు, తదితరుకు ఎమ్మెల్యే కన్నబాబు పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో వీధి విజయసారథి, చక్రీ, దాసరి జగన్, అనుసరి ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

రమణయ్య పేటలో...



వైఎస్సార్ సీపీలో చేరిన రమణయ్యపేటకు చెందిన వారితో...

కాకినాడ రూరల్: రమణయ్యపేట గ్రామానికి చెందిన పలువురు ఎమ్మెల్యే కురసాల కన్నబాబు సమక్షంలో శనివారం రాత్రి వైఎస్సార్ సీపీలో చేరారు. రమణయ్యపేట వైఎస్సార్ సీపీ నాయకులు పంపన పట్టాభి, మేడిశెట్టి లక్ష్మి, పిల్లి వరలక్ష్మి ఆధ్వర్యంలో టీడీపీ, జనసేన నుంచి విత్తనాల చంద్రరావు, వాసంశెట్టి వెంకట శ్రీధర్, విత్తనాల సుబ్బారావు, కాకరపల్లి శ్రీనివాస్, కన్నూరి అచ్చయ్య నాయుడు, అల్లిబిల్లి రామకృష్ణ, తదితరులు 30మంది వైఎస్సార్ సీపీలోకి చేరారు. వీరికి ఎమ్మెల్యే కన్నబాబు పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు.

సమాజ మార్పు కోసమే కవిత్వం



భాషా పండితుడు, శతావధాని సుబ్రహ్మణ్యంను సన్మానిస్తున్న ట్రస్టీలు

కాకినాడ రూరల్: సమాజ మార్పు కోసం, వారి భావాలకు అక్షర రూపం ఇచ్చేది కవిత్వమని శతావధాని, భాషా పండితుడు చినపెద్ది సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రపంచ కవిత్వ దినోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శతావధాని సుబ్రహ్మణ్యంను అడబాల ట్రస్ట్ చైర్మన్ రత్నప్రసాద్, ఆధ్యాత్మిక వేత్త రవిశంకర్ పట్నాయక్, పార్థసారథి, రెడ్నం రాజా, రాఘవరావు, సత్యనారాయణ తదితరులు ఘనంగా సన్మానించారు.

ఎన్ఎస్ఎస్ విద్యార్థుల ఆధ్వర్యంలో వైద్య శిబిరం



శిబిరంలో సేవలందుకుంటున్న మహిళలు, విద్యార్థినులు

కాకినాడ రూరల్: రమణయ్యపేట గ్రామ పరిధిలో ఏపీఎస్పీ వద్ద మోహన్ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య శిబిరం ద్వారా స్థానిక ప్రజలు, విద్యార్థులు వైద్య సేవలను అందించారు. బీపీ, షుగర్, స్త్రీ సంబంధిత వైద్య సేవలు, ఈసీజీ తదితర సేవలను కాకినాడ మెడికవర్ వైద్యులు అందించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. శిబిరంలో సుమారు 200 మందికి వైద్య సేవలందించామని మోహన్ విద్యా సంస్థల కరస్పాండెంట్ ఎం.మోహన్‌రావు, డైరెక్టరు వెంకటేష్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రాంబాబు తెలియజేశారు.

గాంధీభవన్‌ను సందర్శించిన విద్యార్థులు



గాంధీజీ జీవిత విశేషాలను విద్యార్థులకు తెలియజేస్తున్న రామకృష్ణ

బోట్‌క్లబ్: ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఎంఎస్ఎన్ క్యాంపస్ పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ చదువుతున్న విద్యార్థులు శనివారం స్టడీ టూర్‌లో భాగంగా స్థానిక గాంధీభవన్ సందర్శించారు. గాంధీభవన్ కార్యదర్శి వక్కలంక రామకృష్ణ విద్యార్థులకు గాంధీజీ జీవిత చరిత్రను వివరించారు. పొలిటికల్ సైన్స్ ఫైనల్ ఇయర్ విద్యార్థులు గాంధీజీ జీవిత చరిత్రలోని ముఖ్య ఘట్టాలను, పోరాటాలను విద్యార్థులకు వివరంగా తెలిపారు. కాకినాడ ప్రాంతంలో స్వాతంత్రోద్యమంలో గాంధీతో పాల్గొన్న స్వాతంత్ర్య సమరయోధుల జీవితాలను తెలియజేశారు. విద్యార్థులతోపాటు కోర్స్ కోఆర్డినేటర్ కె.జోసఫ్ స్టీఫెన్, విభాగ సహాయ ఆచార్యులు ఎం.నానిబాబు, కె.హరిబాబు, కె.స్వామీజీ ఉన్నారు.

ఎన్నికల ప్రవర్తనా నియమావళికి విరుద్ధం



సమావేశమైన బీజేపీ, జనసేన, టీడీపీ నాయకులతో మాట్లాడుతున్న ఎంసీసీ మండల ఇన్‌చార్జి రమేష్‌నాయుడు

- తిమ్మాపురంలో బీజేపీ, జనసేన, టీడీపీ నాయకుల సమావేశం
- అనుమతి తీసుకోవాలని సూచించిన ఎంసీసీ టీమ్

కాకినాడ రూరల్: తిమ్మాపురం గ్రామంలో బీజేపీ నాయకుడు కాళ్ల ధనరాజు నివాసంలో సమావేశం కోసం బీజేపీ, జనసేన, టీడీపీ నాయకులు శనివారం సమావేశమయ్యారు. పొత్తులో భాగంగా మూడు పార్టీల నాయకులు ఎన్నికల కార్యాచరణపై జనసేన అభ్యర్థి పంతం నానాజీ, మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి తదితరులు చర్చించుకుంటుండగా చాలా మంది బయట వేచి ఉన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో సమావేశాలకు ముందస్తు అనుమతిని ఎన్నికల రిటర్నింగ్ అధికారి నుంచి తీసుకోవాల్సి ఉంది. గ్రామ పంచాయతీ కార్యదర్శి ద్వారా సమాచారం అందుకున్న మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ కాకినాడ రూరల్ మండల టీమ్ ఇన్‌చార్జి, ఎంపీడీఓ రమేష్‌నాయుడు, తిమ్మాపురం ఎస్సై రవీంద్రబాబు తదితరులు అక్కడకు చేరుకున్నారు. అనుమతి తీసుకుని సమావేశం ఏర్పాటు చేసుకోవాలని వారికి సూచించారు. ఈ సందర్భంగా రమేష్‌నాయుడు మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అనుసరించి తాము వ్యవహరించామని, రాజకీయ పార్టీకు అవగాహన కల్పించడం తమ బాధ్యత అన్నారు. ఇంట్లో కొద్ది మంది భేటీ అవ్వడం అభ్యంతరకరం కాదని అయితే సుమారు 80 నుంచి 100 మంది వరకూ ఉన్నారని, వీరిలో కొందరు ఇంట్లోను కొందరు బయట ఉన్నారన్నారు.